



మహిళలతో మాట్లాడుతున్న నారా లోకేష్

సమస్యల ఫిర్యాదుకు 1902 : కలెక్టర్

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పథకాలు అందని వారు టోల్ ఫ్రీ నెంబర్ 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్‌లో నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హాఫీజ్ ఖాన్, డాక్టర్ జె.సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను త్వరితగతిన నాణ్యతతో పరిష్కరించడానికి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు అందుకు సంబంధించిన వెబ్ సైటును ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ప్రజా సమస్యల పరిశీలనలో భాగంగా ప్రతి మండల, జిల్లా, రాష్ట్ర సచివాలయాల్లో కూడా ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటర్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అందుకుగాను ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించామన్నారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాకు రవాణా, ఆర్అండ్‌బి సెక్రెటరీ ప్రద్యుమ్నను నియమించారు. సదరు స్పెషల్ అధికారి నెలకు రెండు సార్లు పర్యటించి జగనన్నకు చెబుదాంకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పాటు పరిష్కరించని ఫిర్యాదులను చూస్తారన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమం ద్వారా అర్హత ఉండి సంక్షేమ పథకాలు లబ్ధిపొందని వారు , ప్రభుత్వ సేవల సమస్యలకు సంబంధించిన అంశాల పై ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వాటికి వైఎస్ఆర్ యూనిక్ ఐడిని కేటాయించడంతో పాటు సదరు సమస్యను ఏదశలో



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యేలు, జెసి, తదితరులు

ఉందని ఫిర్యాదారునికి ఐవిఆర్ఎస్ ద్వారా తెలుపుతూ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తార్నారు. సమస్య పరిష్కారం అయిన తరువాత వారి నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటామన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అందుకు అనుగుణంగా అధికారులంతా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అడిషనల్ ఎస్‌పి డి.ప్రసాద్, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, సిపిఒ అప్పలకొండ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువగళం

- అడుగడుగునా లోకేష్‌కు నీరాజనాలు
- సంఘీభావం తెలిపిన బాలకృష్ణ చిన్న కుమార్తె, అల్లుడు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 94వరోజు కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉత్సాహంగా సాగింది. దారిపొడవునా కోడుమూరు ప్రజలు లోకేష్‌కు ఘనస్వాగతం పలికారు. కర్నూలు మండలం పుల్లయ్య కాలేజి గ్రౌండ్స్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర వెంకయ్యపల్లి మెయిన్ రోడ్డు, రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయం, వెంకయ్యపల్లి, రాంభూపాల్ నగర్, మిలటరీ కాలనీ, తాండ్రపాడు మీదుగా గార్గేయపురం శివారు విడిది కేంద్రానికి చేరుకుంది. దారిపొడవునా వివిధ గ్రామాల ప్రజలు, ఎస్సీలు, మైనారిటీలు, ఈడిగలు, వృద్ధులు, వికలాంగులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. గార్గేయపురం శివార్లలో టిడిపి హయాంలో చెక్ డ్యామ్ నిర్మాణం ద్వారా టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన సరస్సు వద్ద యువనేత సెల్ఫీ దిగారు. అడుగడుగునా యువనేతను చూసేందుకు మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు సైతం పోటీపడ్డారు. పార్టీ కార్యకర్తలు గజమాలలతో యువనేతను సత్కరించారు. బి.తాండ్రపాడు గ్రామస్తులు యువనేతకు వినతిపత్రం సమర్పిస్తూ తమ గ్రామంలో పురాతన కాలంలో సువిశాలమైన చెరువును ఎమ్మెల్యే బినామీలు పూడ్చివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కోడుమూరు పాద యాత్రలో యువనేతకు సంఘీభావంగా పలువురు ప్రముఖులు పాదయాత్రలో పాల్గొన్నారు. బాలకష్ణ చిన్నకుమార్తె తేజస్విని, చిన్నల్లుడు భరత్, మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమా అఖిలప్రియ, ఆలూరు నియోజకవర్గ ఇన్ చార్జి కోట్ల సుజాతమ్మ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, సత్తెనపల్లి పార్టీ నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు తదితరులు లోకేష కు సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్నారు. 94వరోజు యువనేత 10.5 కిలోమీటర్ల దూరం నడిచారు. యువగళం పాదయాత్ర ఇప్పటివరకు 1189 కిలోమీటర్లు పూర్తయింది. పాదయాత్రలో కోడుమూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి ఆకెపోగు ప్రభాకర్, టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి, యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం యువగళం పాదయాత్ర నందికొట్కూరు నియోజకవర్గంలో సాగనుంది.

ఇండస్ట్రియల్ హబ్‌కు భూసేకరణ వేగవంతం

- జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధికి ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలకు సంబంధించి భూమిని సేకరించే ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కార్పొరేషన్ , గ్రీన్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి కొరకు ఓర్వకల్లు మండలంలోని పలు గ్రామాలలో భూములు అవసరమై వాటిని ప్రభుత్వం వారు సేకరించిన నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్, కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి , ఓర్వకల్ తహశీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించి ఇంకా సేకరించవలసిన భూముల వివరాలు గ్రామాల వారీగా , సర్వే నెంబర్ల వారిగా సమీక్షించి భూమిని సేకరించు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రీన్‌కో సోలార్ కంపెనీ వారితో సమీక్షిస్తూ కర్నూలు ఆర్‌డిఒ ఓర్వకల్ తహశీల్దార్ ఇరువురు గ్రీన్‌కో సోలార్ కంపెనీ వారికి కావాల్సిన భూమి వివరాలు , పలు గ్రామాల వారిగా సమీక్షించి అవసరమైన భూమివివరాలు కలెక్టర్ కార్యాలయానికి పంపాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దేవదాయ శాఖ భూముల వివరాలను సేకరించి వారికి చెల్లించాల్సిన నష్టపరిహారం తుది పరిశీలనార్థం కలెక్టర్ కార్యాలయానికి పంపాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, గ్రీన్ కో సోలార్ కంపెనీ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎవిఎస్.నాయుడు, డిస్ట్రిక్ లైసెనింగ్ ఆఫీసర్ గోవర్ధన్, కర్నూలు ఆర్‌డిఒ హరిప్రసాద్ , ఓర్వకల్ తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి

22న కలెక్టరేట్ ఎదుట ఉపాధి కూలీలతో ధర్నా

- స్పందించకపోతే ఆందోళన ఉధృతం - వ్యవసాయ కార్మిక సంఘం హెచ్చరిక

ప్రజాశక్తి -కోడుమూరు

కర్నూలు జిల్లాలో ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 22న కలెక్టరేట్ ధర్నాకు కూలీలందరు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. అప్పటికీ స్పందించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. కోడుమూరులో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ రోజులు పని కల్పించి బకాయిలను వెంటనే చెల్లించా లని కోరారు. కార్మికులకు సరయిన కూలీలు ఇవ్వాల ని, ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో కూలీలకు వారా లు గడుస్తున్నా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఏ పను లు లేక ఉపాధి పనులకు వెళ్తున్న ఏదో కార్మికులను వారానికి ఒకసారి వారు చేసిన పనికి కూలీలను వెంటనే చెల్లిస్తే కుటుంబాలను పోషించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల కుటుంబాలను పోషించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలీలకు రోజుకు రూ.270 ఇవ్వాలని, వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కూలీల సమస్యలపై ఈనెల 22న ముందు పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నామ న్నారు. ఆధర్నాలో ఉపాధి కూలీలందరూ పాల్గొనాల ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జిపి. వీరన్న తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నారాయణ

మాతృ మరణాలు జరగకుండా కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాతృమరణాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనమీద ఎంతగానో ఉందని అందుకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అనుమృతి లేని స్కానింగ్ సెంటర్ల మీద ప్రత్యేక నిఘా ఉంచాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మాత మరణాలు నివారణ తదితర అంశాలపై వైద్య సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ మాతృశిశు మరణాలపై సమీక్ష నిర్వహిస్తూ జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా నగరంలో ఎన్ని స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, వాటి మీద ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సదరు స్కానింగ్ యంత్రాల వివరాలు కూడా సేకరించాలన్నారు. అనుమతి లేని స్కానింగ్ సెంటర్లు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు గ్రామాలలో అందుబాటులో లేని సమయంలో ఆయాలు నిత్యం గర్భిణీ స్త్రీలకు అందుబాటులో ఉండాలన్నారు. అదే విధంగా రక్తహీనత కలిగిన వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ అందజేసేలా చూడాలన్నారు. గర్భిణీ స్త్రీలు ఎవరైతే ఒకరికంటే ఎక్కువ అమ్మాయిలకు జన్మనిచ్చిన తల్లుల వివరాలు ప్రత్యేకంగా తయారు చేయాలని డిఎంహెచ్ఒ, ఐసిడిఎస్ పిడిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆశా, ఎఎన్ఎం మీద ఉందన్నారు. ఒకవేళ వివాహాలను ఆపలేకపోతే ఐసిడిఎస్ అధికారులకు తెలియజేయాలన్నారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా ఇద్దరికి జన్మనిచ్చిన గర్భిణీ స్త్రీ సంబంధీకులకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో ఎఎన్ఎం లేని సచివాలయాలు ఎన్ని ఉన్నాయో సదరు వివరాలను తెలపాలని డిఎంహెచ్ఒను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో గర్భిణీ స్త్రీలను పరిశీలించడానికి పోర్టబుల్ అల్ట్రా సౌండ్ మెషిన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని గైనిక్ హెచ్ఒడికు విన్నవించారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో బాల్య వివాహాల పట్ల ముమ్మరంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ క్లినిక్స్, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను నిత్యం పరిశీలిస్తూ ఉండాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్ఒ రామగిడ్డయ్య, డిసిహెచ్ఎస్, పిహెచ్‌సిల డాక్టర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌టిసి స్థలాలు లీజుకు టెండర్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగం, కర్నూలు జిల్లా పరిధిలోని ఆదోని బస్ స్టేషన్ ప్రాంగణంలోని 1.30 ఎకరాల విస్తీర్ణంలో గల ఖాళీ స్థలం, మంత్రాలయం బస్ స్టేషన్‌లో 1.84 ఎకరాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం బిట్ నెంబరు-1 , మంత్రాలయం బస్ స్టేషన్ నందు 1.00 ఎకరం విస్తీర్ణం గల బిట్ నెంబరు-2, ఖాళీ స్థలాలలో 15 సంవత్సరాల కాల వ్యవధితో అద్దె ప్రాతిపాదికన లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచామని కర్నూలు ఆర్ఎం టేకి వెంకటరామం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న మధ్యాహ్నం రెండుగంటలలోపు టెండర్లు కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీలులో చేసుకోవాలన్నారు. ఈ టెండరు ప్రక్రియపై చర్చించుటకు, తమ సలహాలు, సూచనలతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు 12న శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మంత్రాలయం బస్టాండులో , అలాగే అదే రోజు మధ్యాహ్నం మూడుగంటలకు ఆదోని డిపోలో నిర్వహించనున్న అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఈ సదస్సును కర్నూలు జిల్లా ప్రజా రవాణా అధికారి , కడప డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు (ఓ అండ్ సి) , కర్నూలు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు, కర్నూలుడిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (సివిల్) , ఆదోని డిపో మేనేజరు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఆదోని డిపో మేనేజరు 9959225797 నంబరును, కర్నూలు డిఎఇ 9959166566 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్. కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక సిఆర్ భవన్‌లో విద్యార్థులకు వేసవి సెలవులను పురస్కరించుకొని నెల రోజులపాటు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సిపిఐ నగర కార్యదర్శి రామకష్ణారెడ్డి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి కరాటే మాస్టర్ హుస్సేన్ భాషలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిస్వామి



మాట్లాడుతున్న ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు మండలం, పసుపల గ్రామపంచాయతీ సచివాలయంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నటువంటి కర్నూలు మండలం ఎంపిపి డి వాసు వెంకటేశ్వరమ్మ ఎంపీడీవో భాస్కర్ నాయుడు ఈవోఆర్డి నాగేశ్వర్ రెడ్డి సచివాలయ సిబ్బంది పసుపల పంచాయతీ సెక్రెటరీ హేమంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మా భాష డి వాసు చిన్న లక్ష్మన్న తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు

సమాధానం చెప్పలేక ముఖం చాటేశారు

-దమ్ముంటే ఆరోపణలు నిరూపించాలి
-ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమాధానం చెప్పలేక నారాలోకేష్ ముఖం చాటేశారని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. నాపై చేసిన ఆరోపణలను నిరూపించాలని మరోసారి సవాల్ విసిరారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ కర్నూలు టిడిపి నాయకులు నేతలు చేసిన ఆరోపణలపై రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాపై నారా లోకేష్ నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. తప్పచేసి వుంటే కోర్టుకెళ్ళండి, లేదంటే చర్చకు రండి అడిగినా టిడిపి పార్టీ నేతలు, నారా లోకేష్ సమాధానం ఇవ్వలేదని, దేవుడి సాక్షిగా అడిగినా నారా లోకేష్ రాలేదని, నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు తప్పుడు వ్యాఖ్యలు అని రుజువైందన్నారు. మసీదులో ఏ ముస్లిం సోదరులు అబద్ధాలు ఆడేలేరని, అల్లా సాక్షిగా సమాధానం అడిగినా స్పందించలేదన్నారు. పోలీసులు నన్ను అడ్డుకున్నారన్నారు. నీతి నిజాయితీ రాజకీయాలు చేస్తున్నానన్నారు. తాను ఎవర్నీ డబ్బులు డిమాండ్ చేయడం లేదన్నారు. కర్నూలు టిడిపి నేతలు బురద చల్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. మైనార్టీ వర్గానికి చెందిన తాను న్యాయపోరాటం చేస్తున్నానని, నా వెంట దేవుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండగా వున్నారన్నారు. కోవిడ్ సమయంలో టిడిపి నేతలు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. మైనార్టీ ఎమ్మెల్యేగా కోవిడ్ బాధితులను అదుకున్నానని చెప్పారు. కోవిడ్ సమయంలో మెరుగైన వైద్య సేవలు అందించామని, కోవిడ్ భారీన పడి మృతి చెందిన వ్యక్తులకు దహన సంస్కారాలు చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రైల్వే ప్రసాద్, ఆది మోహన్‌రెడ్డి, ఫిరోజ్, లక్ష్మణ్ నాయుడు, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హాఫీజ్‌ఖాన్

లోకేష్ పర్యటన విజయవంతం

సహకరించిన ప్రజలకు టిజి.భరత్ ధన్యవాదాలు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కర్నూలులో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం చేసిన ప్రజలందరికీ కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి.భరత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వీధుల్లో ఘన స్వాగతం పలకడంతో పాటు లోకేష్‌పై చూపించిన ప్రత్యేక అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. నారా లోకేష్ కర్నూలు పర్యటన సందర్భంగా ఇక్కడి ప్రజల సమస్యలను లోకేష్‌తో ప్రత్యేకంగా చర్చించినట్లు భరత్ చెప్పారు. ప్రధానంగా తుంగభద్ర, హంద్రీ, కేసి కెనాల్ కర్నూలు చుట్టూ ఉన్నప్పటికీ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని లోకేష్ దృష్టికి భరత్ తీసుకువెళ్లారు. కర్నూలు ప్రజల శాశ్వత తాగునీటి కష్టాలు తీర్చేందుకు టిడిపి ప్రభుత్వం వచ్చాక కృషి చేస్తానని లోకేష్ తెలిపారన్నారు. ఇండస్ట్రీయల్ జోన్ ఉన్న కర్నూల్లో పరిశ్రమలు తీసుకొచ్చి ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, హైకోర్టు బెంచ్ కర్నూల్లో ఏర్పాటు చేయాలని, వక్ఫ్ బోర్డు భూములు, క్రిస్టియన్ ఆస్తులు, హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా వాటిని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రధానంగా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు భరత్ చెప్పారు. వివిధ సమస్యలపై ప్రజలనుంచి వచ్చిన వినతులను పరిశీలించి లోకేష్‌రాగానే వాటిని పూర్తిగా పరిష్కరిస్తామని హామీఇచ్చారన్నారు. ఇక లోకేష్ విడిది కోసం గ్రౌండ్ ఇచ్చిన ఎస్‌టిబిసి కళాశాల యాజమాన్యం, ఉస్మానియా కళాశాల యాజమాన్యానికి భరత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టిడిపి నాయకులకు, కార్పొరేటర్లకు, కార్యకర్తలకు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న టిజి.భరత్



ఉషూ శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న గూడూరు గోపాల్

ఉషు వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్ : మంగళవారం పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వేసవి ఉషు శిక్షణ శిబిరాన్ని జిల్లా ఉషు సంఘం అధ్యక్షులు గూడూరు గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉషు క్రీడాద్వారా ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం పెంపొందుతుందని ప్రతిరోజు క్రమం తప్పకుండా మార్షల్ ఆర్ట్స్ సాధన చేసి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని చిన్నారులు చదువుతోపాటు మీకు నచ్చిన క్రీడల్లో సాధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 80 వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమైనా మీకు నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ 35 మంది చిన్నారులు వేసవి ఉషు శిక్షణలో పాల్గొన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుండి ఎనిమిది గంటల 30 నిమిషాల వరకు శిక్షణను ఉంటుందని ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ఎకె. అమ్ముతీశ్వర్, చిన్న శ్రీనివాసులు, ఎం క్రాంతి పాల్గొన్నారని జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు తెలిపారు.



కళ విద్యలో నైపుణ్యత సాధించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టర్

కళ విద్యలో విద్యార్థులు నైపుణ్యత సాధించాలని ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక ఐఎస్ఇ కళాశాలలో కళావిద్యావిభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ కళాశాలలో చేయని విధంగా ఇక్కడ విద్యార్థులు కళ నైపుణ్య ప్రదర్శన చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు కేవలం చదివే కాకుండా వీటిపై దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళా విద్య అధ్యాపకులు డిడి సుధీర్ రాజు కళాశాల అధ్యాపకులు వనం రాజు సురేష్ భీమన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

22న కలెక్టరేట్ ముందు మహా ధర్నా : వ్యకాసం

ప్రజాశక్తి -దేవనకొండ

గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని సమస్యలపైన, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 22వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి, వీరశేఖర్, కె.వి. నారాయణలు పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం దేవనకొండ మండల కేంద్రంలోని స్థానిక సిఎల్ఆర్‌సి భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి నారాయణ మాట్లాడుతూ దేశంలో వలసలు నివారణ, పేదరిక నిర్మూలన, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కొరకు సుదీర్ఘంగా పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ఉపాధి హామీ పనికి భారీగా నిధులు కోత పెడుతున్నారని పేర్కొన్నారు. అనేక నిబంధనలు చేర్చి గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు అరకొరగా నిధులు కేటాయిం చారని పేర్కొన్నారు. అదేవిధంగా గతంలో వేసవి అలవెన్సు, తాగునీటి అలవెన్స్, రవాణా, గడ్డపార అలవేన్సులు ఉండేవని, నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నిటికీ కోత పెట్టిందని పేర్కొన్నారు. సాంకేతికత పేరుతో, రెండు పూటల హాజరు పేరుతో ఉపాధి పనిని ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. అడవి ప్రాంతాల లో నెట్వర్క్ లేని సందర్భంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, బాలకృష్ణ, జిల్లా నాయకులు శ్రీరాములు, దస్తగిరి, మహబూబ్ బాషా, యూసుఫ్ బాష, రంగరాజు, దేవేంద్ర, కొండయ్య, రామాంజనేయులు, రమేష్, నాగేష్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిడిఎం న్యాయమూర్తి రమణారెడ్డి

సత్వర న్యాయానికి కృషి చేయాలి

- పిడిఎం న్యాయమూర్తి రమణారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

సత్వర న్యాయానికి కృషి చేయాలని పిడిఎం న్యాయమూర్తి రమణారెడ్డి అన్నారు. పదోన్నతిపై రాజోలు నుంచి ఆదోనికి వచ్చిన పీడీఎం న్యాయమూర్తి రమణారెడ్డికి ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి రమణారెడ్డి మాట్లాడుతూ చివరి ప్రయత్నంగా న్యాయ స్థానాలకు వచ్చిన కక్షిదారులకు కోర్టు నుంచి న్యాయం దొరకాలన్నారు. అందుకోసం న్యాయవాదులు కూడా పనిచేయాలని సూచించారు. జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పీజే సుధా మాట్లాడుతూ కోర్టు భవనాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్ రెడ్డి, దేశాయ్, విరుపాక్షి రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు అనితా బాయ్, అంజినప్ప, అబ్దుల్ అన్సారీ, వైఆర్ మల్లికార్జున, గిరిధర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

టిడిపి నుండి 12 కుటుంబాలు వైసిపిలోకి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రాంపురంలో ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి సమక్షంలో మండల పరిధిలోని వగరూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పీర్ సాబ్ కుమారులు, బంధువులతో కలిపి 12 కుటుంబాల వారు వైసిపిలోకి చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసిపి గెలుపు తథ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, వీరారెడ్డి, ఎంపీటీసీ చిన్నన్న, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేసిన నాయకులు

చైతన్య యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆదోని

రాయలసీమకు ప్రత్యేక పారిశ్రామిక పాలసీ ప్రకటించాలని, నూతన పరిశ్రమలను స్థాపించాలని, ఉపాధి మెరుగుపరచాలని, కరువు, వలసలను నివారించాలని తదితర డిమాండ్‌ల సాధనకు ఈనెల 23, 24 తేదీలలో ఏఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో నిర్వహించే రాయలసీమ వలస కార్మికుల చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయు రాష్ట్ర అధ్యక్షులు కరీం బాష, జిల్లా అధ్యక్షులు గంగన్న, ఆర్‌సీసీ పొలిటికల్ ఆర్గనైజర్ రాజు కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌సీసీ కార్యాల యంలో కరపత్రలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డారు. రాయలసీమ అభివృద్ధి కోసం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఉపాధి కోసం, ఇతర ప్రాంతాలకు వలస పోతున్న కూలీల కోసం, సాగు నీటి సౌకర్యం లేక చిన్న మధ్య రైతాంగం కోసం చైతన్య యాత్రను నిర్వహించతలపెట్టామన్నారు. ఈ యాత్రకు మద్దతుగా ఏపీడిఏ ఆదినారాయణ, రిటైర్డ్ తహశీల్దార్ షేక్షావలి, పీఓడబ్ల్యూ సుజ్ఞానమ్మ, ఏఐఎఫ్‌టీయు నాయకులు ఉసెని, బాష, ఆర్‌సీసీ రాష్ట్ర నాయకులు ప్రతాప్, రాజ్ కుమార్, సుధాకర్, రవి వర్మ, శాంత రాజు, అనిల్ పాల్గొన్నారు.

సింగరాజన్నహళ్లిలో గడపగడపకు ..

ప్రజాశక్తి - మంత్రాలయం

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై ప్రదీప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సింగరాజన్నహళ్లి గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు నాయకులు వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకొని,పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ కిరణ్, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను అందజేస్తున్న వై ప్రదీప్ రెడ్డి

'జగనన్నకు చెబుదాం' మరో డ్రామా : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

'జగనన్నకు చెబుదాం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మరో డ్రామాకు సీఎం తెర తీశారని టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మ, సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప విమర్శించారు. మంగళవారం వారి కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన 1902 కార్యక్రమంలో ఇస్తున్న వినతులకు పరిష్కారాలే లేవు. ఇపుడు జగనన్నకు చెబుదాం అంటూ మరో మోసానాకి శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రిపై విరుచుకుపడ్డారు. కొందరు వైసిపి నాయకులు కబ్జాలు, దందాలు చేస్తున్నా.. బాధితులు స్పందనలో ఫిర్యాదు చేస్తున్నా.. మీకు కనపడవా అని మండిపడ్డారు. నాలుగేళ్లుగా రాయలసీమకు వైసిపి ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. దీనిపై ప్రజలు, ప్రతిపక్షం ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికైనా కనీసం మిగిలిన ఈ ఒక్క అర సంవత్సర కాలమైనా సీమకు మేలుచేయలేకపోతే వైకాపా నేతలు, ముఖ్యమంత్రి సీమద్రోహులుగా శాశ్వతంగా చరిత్రకెక్కుతారని అన్నారు. సమావేశంలో మాజీ ఎల్ఎల్సీ మెంబర్ బసాపురం రామస్వామి, మాజీ కౌన్సిలర్ రామచంద్రప్ప, షేక్షావలి, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు


చేతి ఎత్తులో వెళ్ళిన విద్యుత్ వైర్లు

పొంచి ఉన్న ప్రమాదం

- ఇంటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి - దేవనకొండ

మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఇళ్లపైనే త్రీఫేస్ విద్యుత్ వైర్లు పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే భయాం దోళనలో ఉన్నామని ఆ గ్రామస్తులు వడ్డే నాగరాజు, రాఘవేంద్ర, కొమ్మరి వీరన్న, చాకలి వీరేష్ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు తీగలు మిద్దెలపైనే చేతికి అందే తక్కువ ఎత్తులోనే పోవడంతో ఇళ్లకు విద్యుత్ ప్రవాహం సరఫరా కావడంతో గోడలకు ముట్టుకుంటే షార్ట్ సర్క్యూట్ వస్తుందని పేర్కొన్నారు. అసలే గత కొన్ని రోజుల నుండి మెరుపులు, ఉరుములు, ఈదురు గాలులతో వర్షాలు కురుస్తుండడంతో విద్యుత్ తీగలు ఒకటికి ఒకటి తాకి అగ్గి రవ్వలు వస్తున్నాయన్నారు. మంగళవారం తెల్లవారుజామున విద్యుత్ తీగలు రాసుకుని దగ్గర్లో ఉన్న కట్టకు నిప్పు అంటుకొని ఇంటి మొత్తం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో భయాందో ళనకు గురయ్యామని వడ్డే నాగరాజు తెలిపారు. విద్యుత్తు తీగలతో పొంచి ఉన్న ప్రమాదం గురించి చరవాణిలో ఇన్చార్జి విద్యుత్ ఏఈ నారాయణ స్వామి నాయక్ దృష్టికి తీసుకువెళ్లగా విద్యుత్ సిబ్బందితో పరిశీలించి విద్యుత్ వైర్లు, స్తంభాలు మార్పు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్పంచి ధనలక్ష్మిది ప్రభుత్వ హత్యే : టిడిపి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



సర్పంచ్ ధనలక్ష్మి ఆత్మహత్య కాదని ముమ్మాటికి ప్రభుత్వమే అత్యేనని టిడిపి తెలుగు జిల్లా మహిళ అధికార ప్రతినిధి నర్వ శశిరేఖ స్పష్టం అన్నారు. మంగళవారం ఆమె పెద్దకడబూరులోని విలేకరులతో మాట్లాడా రు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ప్రకాశం జిల్లా దర్శి మండలం రామచంద్రపురం గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి ఆత్మహత్య దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే వైసీపీ సర్పంచ్‌గా ఎన్నికై వైసీపీ ప్రభుత్వం వారే తమకు రావలసినటువంటి నిధులను దారి మళ్లించడం వలన చేసిన పనులు బిల్లులు రాక అప్పుల బాధతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేక అప్పుల వారికి సమాధానం చెప్పుకోలేక ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో సర్పంచులందరి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా దారి మళ్లించిన నిధులను తక్షణమే స్థానిక సంస్థల అకౌంట్లో జమ చేయాలని లేకపోతే ధనలక్ష్మి లాంటి ఆత్మహత్యలు మరెన్నో చూడాల్సి వస్తుందన్నారు. తక్షణమే ధనలక్ష్మి కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని నరవ శశిరేఖ డిమాండ్ చేశారు.



సర్పంచుల అధికారాలను హరిస్తున్నారు

ప్రజాశక్తి - హొళగుంద

అధికారులు సర్పంచుల అధికారాలను హరిస్తున్నారని సర్పంచ్‌ల సంఘం డివిజన్ అధ్యక్షుడు యం.డి.హళ్లి సర్పంచ్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని యం.డి.హళ్లి గ్రామం లో సర్పంచ్‌కె తెలియకుండా ఉపాధి హామీ పథకం ఎపిఒ, సిబ్బంది గ్రామంలో వచ్చి ప్రోటోకాల్ లేకుండా విచారణ పేరుతో మీటింగ్‌ను ఏర్పాటు చేసి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయడం విచారకరం అని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉండాలని ఎలాంటి అవినీతి లేదని ప్రజలు తెలిపినా ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడం దారుణం అన్నారు. సర్పంచ్‌కు గ్రామస్థులకు విరుద్ధంగా ఉంటున్న అధికారులపై త్వరలో పంచాయతీ రాజ్ ఛాంబర్ దృష్టికి, కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేవరకు పోరాడతామని సుధాకర్ తెలిపారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజలపై విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం డివిజన్ నాయకులు హనుమంతు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ట్రూ ఆప్ చార్జీల పేరుతో కోట్లాది రూపాయలు బడుగు బలహీన వర్గాలపై వేసింది అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం డివిజన్ నాయకులు హనుమంతు, పట్టణ నాయకులు రాముడు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మా ప్రభుత్వం వస్తే ఐదేళ్ల కాలంలో విద్యుత్ చార్జీలు పెంచమని తన ఎన్నికల ప్రచారంలో నిర్వహించి అధికారంలో వచ్చిన తర్వాత మాట తప్పన్నారు. పెంచిన విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అబ్దుల్లా, రాజు, వెంకటేశ్వర శెట్టి, రమేష్, ఆంటోనీ, రవికుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం డివిజన్ నాయకులు హనుమంతు


ఎంఈఓ కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ఉన్న మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అజిత్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నాడు ఎంఈఓ ఆంజనే యులకు ఎస్ఎఫ్ఐ నాయకులు అజిత్ నాయకత్వంలో వినతిపత్రం ఇచ్చా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాచాని సోమప్ప స్కూల్లో అక్రమంగా అడ్మిషన్లు, డొనేషన్లు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని అన్నారు. స్కూల్ పై తక్షణమే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదోని డిప్యూటీ డీఈఓ సుకుమార్‌కి ఫోన్ చేసి సమస్యను గురించి వివరించారు. ఆయన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చర్యలు తీసుకోలేని పక్షంలో పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పందనలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల టిడిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి రైతులు కష్టపడి పండించిన మిరప పంట తడిసిపోయి నష్టపోయారని అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరి, బొప్పాయి, మునగ, పసుపు లాంటి పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులందరికీ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతో పాటు పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నజీర్ సాహెబ్ తిరుపతయ్య నాయుడు, ఎన్వి రామాంజనేయులు, శ్రీధర్ నాయుడు, కృష్ణమ నాయుడు, రమేష్ నాయుడు, రంగస్వామి నాయుడు, పూజారి చంద్రశేఖర్, మదీనా, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, కులుమాల రాముడు, నూర్ అహ్మద్, అచ్చు గట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, అబ్దుల్లా,పూజారి రంగస్వామి ముల్లబాష పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఆరోపణలు బివిజె నిరూపించాలి : వైసిపి

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై నిరాదరణ ఆరోపణలు చేసిన నారా లోకేష్, మాజీ ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డిలు నిరూపించాలని వైకాపా సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డిలు అన్నారు. మంగళవారం నందవరంలోని శివారెడ్డి గౌడ్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎమ్మెల్యే ఎర్రకోట రాజకీయాల్లో రాకముందే సంపన్న కుటుంబంలో పుట్టారని, ఆయనకు అవినీతి చేసే దుస్థితి రాలేదన్నారు. ఎమ్మెల్యే అను చరులు కొన్ని వ్యాపారాలు చేసుకుని సంపాదించారు తప్ప అక్రమంగా ఎక్కడ సంపాదించలేదని, అక్రమంగా సంపాదించినట్లు మాజీ ఎమ్మెల్యే నిరూపించాలన్నారు. వైకాపా నాయకులపై ఎవరికైనా ఆరోపణ చేసే ముందు అవినీతి ఆరోపణలు నిరూపిస్తామన్నప్పుడు మాత్రమే ఆరోపణ చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు చాంద్, రమేష్ గౌడ్, మీసాల సంపత్ గౌడ్, చాంద్ తాత, వంకాయల పంపయ్య, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతూన్న వైకాపా సీనియర్ నాయకుడు లక్ష్మీ కాంత రెడ్డి

గ్రంథాలయ భవనాన్ని విస్తరించాలి

ప్రజాశక్తి - ఆదోని:

పెరుగుతున్న పాఠకుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతమున్న గ్రంథాలయ భవనాన్ని విస్తంపచేయాలని రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు ఆర్ దేవప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను విజ్ఞప్తి చేశారు. భవనం ముందు, వెనుక భాగాల్లో, ఇరువైపులా ఖాళీ స్థలం ఉందన్నారు. ఈ స్థలాన్నింటిని కలుపుకొని గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలన్నారు. ఉన్నతాధికారులు స్థానిక అధికారులను సంప్రదించి గ్రంథాలయ అభివృద్ధి కోసం స్థల పత్రాలను పరిశీలించాలన్నారు.


జగనన్నకు చెబుదాం కార్య క్రమంలో సర్పంచ్, అధికారులు

ప్రతి పేదోడికీ న్యాయం : సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిన్న గ్రామాలలో జీవనం సాగించే ప్రతి పేదోడికి కూడా ఏ సమస్య ఎదురవకుండా పరిష్కరించాలని ఆకాం క్షతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేసి టోల్ ఫ్రీ నెంబర్ 1902 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం తీసుకొచ్చారని, ఈ కార్యక్రమం వల్ల ప్రతి పేదోడికి న్యాయం జరుగుతుందని సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీడీవో సుధాకర్ రాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరి సచివాలయ కార్యా లయంలో సర్పంచ్ గోవిందరాజులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నిర్వహి ంచిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్నకు చెబు దాం కార్యక్రమమును అధికారులు, ప్రజా ప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాలన్న, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల అమ్మకాలు నిలిపివేయాలి

ప్రజాశక్తి - మంత్రాలయం

దుకాణాల్లో విత్తనాల వివరాలు సక్రమంగా తెలిపే వరకు పత్తి, మిరప విత్తనాల అమ్మకాలు నిలిపవేయాలని వ్యవసాయ శాఖ కర్నూలు ఎమ్మిగనూరు ఎడిఎలు సాలురెడ్డి మహ్మద్ ఖాద్రీ ఆదేశించారు. మంగళ వారం మండల పరిధిలోని కాచాపురం గ్రామంలోని సిద్ది వినాయక, ఆగ్రో ఏజెన్సీ, శ్రీ వీరభద్రేశ్వర ఎంటర్ ప్రైజస్‌లోని విత్తనాల నిల్వలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తగిన నిల్వల ఆధార బిల్లులు కంపెనీ పత్రాలు సరిచేసుకోవాలని అప్పటి వరకు అమ్మకాలు నిలిపవేయా లన్నారు. ప్రతి దుకాణాల్లో నిల్వల వివరాలు తెలిపే పట్టికను వినియో గదారుల తెలిసేల ఉంచాలని ఎంఆర్‌పి ధరను పట్టికలో పొందుపరచాలని సూచించారు. వినియోగదారుల నుంచి అధిక ధరలకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి జీరా గణేష్ పాల్గొన్నారు.

టిబి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆదోని

ప్రధాన మంత్రి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 15 మంది పేద టీబీ రోగులకు పట్టణానికి చెందిన ఆదెప్ప మిత్ర బృందం, టీబీ క్లినిక్ స్టాఫ్ సంయుక్తంగా పట్టణంలోని టీబీ కేంద్రంలో మంగళవారం పోషకా హార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకూన్ బాను, ఎంపీహెచ్ఎస్ బాబు రాజు మాట్లాడారు. నిర్ధారణ అయిన టీబీ రోగులకు ప్రభుత్వం నుంచి ఆరె నెలలపాటు ఉచితంగా మందులతో పాటు రూ.500 అందిస్తారన్నారు. దేశాన్ని టీబీ రహిత దేశంగా మార్చేందుకు దాతలు ముందుకొచ్చి టీబీ రోగులను దత్తత తీసుకొని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీహెచ్‌వీలు లలితమ్మ, సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - హలహర్వి

బాల్య వివాహాల చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులదే అని సచివాలయాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బాల్యవివాహాల చట్టాలు, చైల్డ్ లైన్ చట్టాలపై మహిళా పోలీసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతుంటాయని వీటిపై వాలంటీర్లు దృష్టి సారించాలని కోరారు. బాల్యవివాహాలు అమ్మాయిల భవితకు అడ్డంకిగా మారుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఒ సునీత, సూపర్వైజర్లు, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసులు


కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ కూలీల వేతనాలను ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి ఈడిగ తిక్కన్న, మండల నాయకులు శరణువాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఉపాధి కూలీలతో పని ప్రదేశంలో వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి కూలీల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రెండు వారాల నుండి వేతనాలు సక్రమంగా అందలేదని కొంతమంది కూలీలు నేతలకు తెలిపారు. ఉపాధి పనులను పాత పద్ధతిలో కొనసాగాలని కోరారు. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను అందించి, గడ్డపార ఖర్చులను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బంబం స్వామి ఉరుసు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల కేంద్రమైన చిప్పగిరిలో బంబం స్వామి ఉరుసు మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువ జామున దర్గా పీఠాధిపతి సయ్యద్ ఆరిపదీన్ ఖాద్రి ఆధ్వర్యంలో స్వామి వారి ప్రతిమను అశ్వంపై ప్రతిష్టించి గ్రామంలోని పురవీధుల గుండా మేళ తాళాలతో స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్నవారు పురు షులు, మహిళలు పొర్లు దండాలు పెడుతూ మొక్కుబడి చెల్లించుకున్నారు. స్వాములవారు ఊరేగింపులో తెలుగు రాష్ట్రాల నుంచే గాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అనేకమంది భక్తాదులు వచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్గా దగ్గర వచ్చిన భక్తులందరికీ కూడా కనీస సౌకర్యాలను కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు స్వాముల వారినీ దర్శించుకుని కాయ కర్పూరం అర్పించారు.

టిడిపి కురువ సాధికారిక కమిటీ మెంబర్లు ఎన్నిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ కురువ సాధికారిక కమిటీ మెంబర్లుగా ఎమ్మి గనూరు నియోజక వర్గంలో కే తిమ్మాపురం గ్రామానికి చెందిన కురువ తుంబలం మల్లికార్జు న, నందవరం మండలం నది కైరవడి గ్రామానికి చెందిన కురువ వీరేష్‌లు ఎంపికయ్యారు. అవకాశం ఇచ్చినందుకు తమ నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.వీ డాక్టర్ జయ నాగేశ్వర్ రెడ్డికి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డికి ఎంపికైన అభ్యర్థులు ధన్యవాదాలు తెలియజేశారు.


కె.టి మల్లికార్జున


నారా లోకేష్, బివిజెలతో కే.వీరేష్





మాట్లాడుతున్న ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

చిత్తశుద్ధితో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- తాడేపల్లి నుంచి 'జగనన్నకు చెబుదాం' ప్రారంభం
- వినతుల పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నెంబర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, జెసి, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, ఆ దిశలో అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్,ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఐడిసి చైర్మన్ కర్రా గిరిజ, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, అడిషనల్ ఎస్‌పి రమణ, డిఆర్‌ఒ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. ప్రతిరోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్పందనలో సిబ్బంది హాజరై వినతులు స్వీకరించాలన్నారు. మండల స్థాయిలోనే అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ జరిపి పరిష్కరిస్తే 90 శాతం సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా తెలియ జేయవచ్చన్నారు. సంక్షేమ పథకాలు, వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే ఫిర్యాదు చేయవచ్చన్నారు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంటుందన్నారు. జిల్లాలోని ప్రజలందరూ 'జగనన్నకు చెబుదాం' 1902 టోల్ ఫ్రీ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిందు సేద్యంతో అధిక లాభాలు

- ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి - మహానంది

బిందు సేద్యంతో అరటి రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఎపి ఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని 1వ గ్రామ సచివాలయం వద్ద అరటి రైతులకు బిందు సేద్యం, మార్కెటింగ్, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు తగిన సమయంలో తగిన మోతాదులో డ్రిప్ ద్వారా ఎరువులను, నీటిని అందించాలన్నారు. మార్కెటింగ్ గెల నాణ్యత పరిమాణాలను పెంచుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణానికి అనుగుణంగా సిగతోకి ఆకుమచ్చ తెగులు వ్యాపించేందుకు అవకాశం ఉందని, దానికి తగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ఉద్యాన అధికారి శ్రీధర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు అరటిపంటకు నష్టం వాటిల్లకుండా రైతులు తగిన సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రస్తుతం ఉన్న పంట దశలో సూక్ష్మ పోషకాలు అందించాలని, అరటిగేల నాణ్యత పరిమాణాన్ని పెంచుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలోని దాదాపు ప్రతి రంగంలో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందని, అయితే వ్యవసాయ పరిశ్రమలో డ్రోన్ల వాడకం విజృంభిస్తోందని, వ్యవసాయ సంబంధ నిర్ణయాలను మెరుగ్గా తెలియ జేయడానికి వ్యవసాయ క్షేత్రాలపై డ్రోన్‌ల ద్వారా సేకరించిన సమాచారం తరచుగా ఉపయోగించబడుతుందని తెలిపారు. అనేక ప్రాంతాలలో డ్రోన్ల వినియోగం ఇప్పటికే పెద్ద ఎత్తున ఖచ్చితత్వ వ్యవసాయ కార్యకలాపాలలో ముఖ్యమైన భాగంగా మారిందన్నారు. పచ్చి రొట్టె ఎరువులు, విత్తనాలైనా జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రివ్యూలిస్ కంపెనీ అగ్రానేమిస్ట్ అబ్దుల్ రహీం, డిసిఒ వేణుగోపాల్, వైసిపి నాయకుడు కొండా మధుసూదన్ రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ పల్లవి, ఇంద్రాణి, హరిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - బేతంచర్ల

ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఆన్లైన్ ద్వారా హాజరు తీసుకుంటున్న ఫొటో ఫేస్ యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అర్.ఈశ్వరయ్య, మండల కమిటీ సభ్యులు ఎస్ఎన్ ఓబులేసు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బైనపల్లె గ్రామ శివారులోని శేషయ్యపారులో బైనపల్లె, శంకరాపురం రెండు గ్రామాల ఉపాధి కూలీలు చేస్తున్న ట్రాగర్ ట్రేన్సెస్ కాలువ పనులను వారు పరిశీలించి కూలీల స్థితిగతులు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి పెద్ద ఎత్తున నిధుల్లో కోత పెట్టారన్నారు. కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి కూలీలపై కక్ష సాధింపు చర్యలు కొనసాగించడం సరైన పద్ధతి కాదన్నారు. మోడీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు తప్ప వ్యవసాయ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి హామీ పథకంలో కొత్త కొత్త నిబంధనలు తీసుకుని వచ్చి వ్యవసాయ కార్మికులను బానిసల్లా చేసి శ్రమను దోచుకోవాలని చూస్తే 2024లో జరుగు లోకసభ, సార్వత్రిక ఎన్నికల్లో వారే ఓటు ద్వారా మోడీకి, మోడీతో జతకట్టే పార్టీకి సరైన సమాధానం చెబుతారని తెలిపారు. ఈ సమావేశంలో శంకరాపురం గ్రామ పంచాయితీ ఫీల్డ్ అసిస్టెంట్ టి.శారదమ్మ, ఇ.వెంకటేశ్వర గౌడ్, ఎన్.శ్రీనివాసులు, టి.విజయ రంగస్వామి, ఎ.రామ్మోహన్, కె.నరసమ్మ, టి.అచ్చమ్మ, ఎ.నాగరాజు, ఎస్.శ్రీదేవి, టి.రాములమ్మ, ఎం.వెంకట లక్ష్మమ్మ, వై.సుభాషిని, బి.వెంకటేశ్వరమ్మ, టి.నాగకిట్టు, బైనపల్లె, శంకరాపురం గ్రామాల ఉపాధి హామీ మేటీలు, కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నాయకులు ఆర్.ఈశ్వరయ్య

మహా కుంభాభిషేకం

మహోత్సవానికి సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 25 నుండి 31వ తేదీ వరకు జరగనున్న మహా కుంభాభిషేకం మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఆహ్వానం పలుకుతూ మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనములతో పాటు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తిలు పాల్గొన్నారు.



సిఎంకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి వార్తకు స్పందన

అక్రమ కట్టడం తొలగింపు

ప్రజాశక్తి - కొత్తపల్లి

'దళితుల పట్ల వివక్ష, దేవాలయం పక్కన నడవకూడదని దారిలో అక్రమ కట్టడం, అధికారులకు తెలిపినా పట్టించుకోని వైనం' శీర్షికనన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం కొత్తపల్లిలోని ఆలయం పక్కన దళితుల నివాసాలకు వెళ్లే దారిలో అక్రమంగా కట్టిన నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి, గ్రామ సర్వేయర్ అబ్దుల్ ఆధ్వర్యంలో గోడను తొలగించారు. ఈ విషయంపై దళితులు మాట్లాడుతూ 2014లోనూ అప్పటి అధికారులు గోడను తొలగించారని, అప్పటి నుంచి సమస్య లేకుండా ఈ రస్తాలో తిరిగే వారమన్నారు. ప్రస్తుతం మళ్లీ అదే సమస్య పునరావృతం కావడంతో ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి వెళ్లిందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి మండల స్థాయి అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. వెంటనే మండల స్థాయి అధికారులు అక్రమ గోడ నిర్మాణాన్ని తొలగించారన్నారు. ఈ సమస్య భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకుండా జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్య ప్రజాశక్తి దినపత్రిక ద్వారా పరిష్కారం కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.



అక్రమంగా కట్టిన గోడను తొలగిస్తున్న అధికారులు

నాటు సారా స్థావరంపై దాడి

- 30 లీటర్లు స్వాధీనం - 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో గోశాల సమీపంలో నాటుసారా స్థావరంపై మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ పోలీసు సిబ్బందితో మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ సురసుర భూపాల్, అతని కుమారుడు సురసుర శ్రీకాంత్ కలిసి మండ్ల నరసింహులును కూలికి పిలుచుకొని నాటుసారా తయారు చేస్తుండగా దాడి చేశామన్నారు. నరసింహను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు. మిగతా తండ్రీకొడుకు పరారీలో ఉన్నారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో పోలీసులు నిఘా పెట్టినట్టు చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలు, సారా అమ్మకాలు, తయారీని ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో ఎక్కడైనా నాటు సారా తయారీ, అమ్మకాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శేషు, శేఖర్ పాల్గొన్నారు.

21న భూమా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఏవి ఫంక్షన్ హాల్ వెనుక మైదానంలో ఈ నెల 21న భూమా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బిజెపి ఆళ్లగడ్డ తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ యువ క్రీడాకారుల్లోని ప్రతిభ వెలికి తీసేందుకు రాయలసీమ స్థాయి గ్రేస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు నగదు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రాయలసీమ లోని యువ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్ఎస్ సయ్యద్ మీర్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పెద్ద మదరసా మదీనా తుల్ ఉలూం అధ్యక్షులు ఎం.ఎ.రషీద్,ఉలేమాలా ఆధ్వర్యంలో వైసిపి పట్టణ అధ్యక్షుడుగా ఎన్నికైన ఎన్ఎస్ సయ్యద్ మీర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. వైసిపి టౌన్ అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి మదరసా మదీన తుల్ ఉలూం అధ్యక్షులు ఎం.ఎ.రషీద్, ముస్లిం మైనారిటీ మత పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మత పెద్దలు అమీర్ సాబ్ హబీబుల్లా, ఉలేమాలు పండు ముర్తుజా, జాకీర్ మౌలానా, ముర్తుజా బేగ్ మౌలానా, కలిముల్లా మౌలానా, మజీద్ మౌలానా, మత పెద్దలు కాంట్రాక్టు మాబు, ఎహెచ్‌కె.వలి, కూరగాయల బాబు, మోమిన్ బాషా, సోఫిసా, కలిముల్లా, నూరిస్లాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి

- కోతలు విరమించుకోవాలి
- కలెక్టర్‌ను కలిసిన ఎపిడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - నంద్యాల

సర్క్యులేషన్ ప్రాతిపదికన అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) నంద్యాల జిల్లా ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. మంగళవారం ఎపిడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి జీవో 38 వలన జర్నలిస్ట్‌లకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కొత్త జీవో వలన ప్రభుత్వం ఇస్తున్న అక్రిడిటేషన్‌లలో తీవ్ర కోత విధించబోతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన, నియోజకవర్గంకు రెండు అక్రిడిటేషన్లు ఈ ఏడాది ఇస్తున్నట్లు ఐ అండ్ పిఆర్ అధికారులు చెబుతున్నారని, దీనివల్ల చాలా మంది జర్నలిస్టులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిజాన్ని నమ్ముకొని పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్‌లు అక్రిడిటేషన్ లేకపోవడం వల్ల సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటివి కోల్పోతారన్నారు. కాబట్టి అర్హత కలిగిన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ ఇవ్వాలని ప్రతినిధి బృందం కోరింది.

జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎపిడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లా కేంద్రంలో అనేక ఏళ్ల నుండి వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్నారని, వారికి కనీసం కూర్చోవడానికి ఒక స్థలం అంటూ లేదన్నారు. జర్నలిస్టుల కోసం జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర నాయకులు డి.మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షులు మాదాల శ్రీనివాసులు, జిల్లా నాయకులు నాగవర్ధన్ రెడ్డి, నంద్యాల పట్టణ కార్యదర్శి ఏ.జగన్ మోహన్, పట్టణ ఉపాధ్యక్షులు జాషువ, సహాయ కార్యదర్శులు మల్లికార్జున, ఇక్బాల్, నాయకులు ప్రకాష్, సుబ్బరాయుడు, మధు, దాసు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, జర్నలిస్టులు

పవిత్ర ఖురాన్‌ను కించపరిచిన ఎమ్మెల్యే

- నారా లోకేష్‌కు, మైనార్టీలకు క్షమాపణ చెప్పాలి
- టిడిపి మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు మౌలనా ముస్తాక్ అహమ్మద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముస్లిం మైనార్టీలకు పవిత్ర గ్రంధమైన ఖురాన్‌ను చేతపట్టుకుని కర్నూల్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కించపరిచారని తెలుగుదేశం మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ ఆరోపించారు. మంగళవారం స్థానిక ఇక్రా పాఠశాలలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల కోసం కర్నూల్‌లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఛాలెంజ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పవిత్ర గ్రంథం చేతపట్టుకుని కించ పరిచే విధంగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ఖురాన్‌లో అందరూ బాగుండాలి, జీవిత సత్యాలు తెలుసుకొని మంచిగా ఉండాలని పొందుపరిచారన్నారు. అరాచకాలు, దౌర్జన్యాలు, భూ కబ్జాలు చేసి ఖురాన్‌ను చేతపట్టుకుంటే అపద్దాలు నిజాలు కావన్నారు. ఎమ్మెల్యే చేసిన తప్పు తెలుసుకొని నారా లోకేష్, మైనార్టీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో ప్రజలు ప్రశ్నిస్తే జైలుకు, తప్పుడు కేసులు పెడుతున్నారని, కొందరు పోలీసులను చేతిలో పెట్టుకొని ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఇస్లాం అంటే భయం, భక్తి లేకుండా మాట్లాడడం తగదన్నారు. సర్వే నెంబర్ 209/1లో మీ తండ్రి ఓ మసీదు లీజు వ్యవహారంలో కోర్టు 3 నెలల్లో బకాయిలు చెల్లించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం రంజాన్ పండుగకు మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తే సొంత ఇఫ్తార్ విందు అని చెప్పుకోవడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో గెలుపునకు మైనార్టీలు అందరూ దువా చేస్తే మైనార్టీలకు ఏమి చేశావని ప్రశ్నించారు. గోనెగండ్లలో ఓ యువతిని మానభంగం చేస్తే నోరు ఎందుకు విప్పలేదని ప్రశ్నించారు. కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి టైమ్ లేదా అని ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు సవాల్ విసిరే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబానికి నేటివరకు న్యాయం జరగలేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూల్ ఎయిర్ పోర్ట్ సమీపంలో రాష్ట్ర ఉర్దూ యూనివర్సిటీకి 100 ఎకరాలు కేటాయిస్తే వైసిపి ప్రభుత్వం నిలబెట్టిందా అని ప్రశ్నించారు. మైనార్టీలపై ప్రేమ ఉంటే దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్లు ఎక్కడా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల గళం యువగళమన్నారు. ప్రజల్లో భయం పోగొట్టడానికే పాదయాత్రలు చేస్తున్నారని అన్నారు. విధుల్లో తిరిగే దమ్ము లేక మసీదులో కూర్చొని మాట్లాడడం సిగ్గులేని వారు చేసేపని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి డబుల్ డిజిట్ కూడా రాదని జోష్యం చెప్పారు. ప్రజలు మాయమాటలు వినే పరిస్థితులలో లేరని, వచ్చే ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు.



మాట్లాడుతున్న మౌలనా ముస్తాక్ అహమ్మద్

కార్పొరేట్‌కు ధీటుగా ఆదర్శ పాఠశాల

- ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరావు

ప్రజాశక్తి - రుద్రవరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగేశ్వరరావు

కార్పొరేట్‌కు దీటుగా రుద్రవరం ఆదర్శ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతి ఆన్లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయిందన్నారు. ఈ నెల 25 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి చివరి అవకాశం ఉందన్నారు. ఇంటర్ విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా ఉన్నతమైన మార్కులు సాధించారని అన్నారు. ఇంటర్‌లో 935, 934, 927 మార్కులు, 10వ తరగతిలో 538, 511, 503 మార్కులు సాధించి జిల్లాలోనే ఒక సుస్థిర స్థానాన్ని కైవసం చేసుకున్నామని చెప్పారు. కార్పొరేట్, ప్రైవేటుకు ధీటుగా సర్కార్(ఆదర్శ) బడి ముస్తాబై, ఇంగ్లీష్ మీడియం విద్యాబోధనతో పాటు సకల వసతులతో అన్ని సబ్జెక్ట్స్ ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఆహ్లాదకర పరిసరాలు, పాఠశాల ఆవరణలో గార్డెన్లను అందంగా తీర్చిదిద్ది మండల విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తుందన్నారు. ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రైవేటుకు ఏ మాత్రం తీసిపోకుండా అభివృద్ధి పథంలో ముందుకు పోతూ విద్యార్థి, తల్లిదండ్రుల, ఉపాధ్యాయ సహకారంతో కలిసి కట్టుగా కృషి చేస్తున్నారన్నారు. 6వ తరగతి ఆన్లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమయిందని, స్కూల్‌లో జూన్ 21న టెస్ట్ ఉదయం 10 నుండి 12 గంటల వరకు ఉంటుందని, ఫీజు ఎస్సీ ఎస్టీలకు రూ.75, ఓసి, బిసిలకు రూ.150 ఆన్లైన్ లో పే చేయాలన్నారు. వివరాలకు 9849215838 సంప్రదించాలని తెలిపారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని పండ్లాపురం, అవుకు మండలం కాశీపురం, కొలిమిగుండ్ల మండలం బెలూం, సంజామల మండలం ఎగ్గోని గ్రామాలకు చెందిన గ్రామానికి చెందిన యువకులకు మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి సతీమణి థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిరా క్రికెట్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని కోరారు.

విద్యార్థినికి జడ్పిటిసి అభినందన

ప్రజాశక్తి - అవుకు

పట్టణానికి చెందిన గాజుల శేఖరయ్య కుమార్తె జి.మానస పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 566 మార్కులు సాధించడంతో అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి మంగళవారం అభినందించారు. జి.మానస పట్టంలోని మదర్ మోడల్ ప్రైవేట్ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించింది. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తున్న గాజుల శేఖరయ్య కుమార్తె మానస పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో రెండో ర్యాంక్ సాధించడం గర్వ కారణమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

యువగళంను విజయవంతం చేద్దాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : శ్రీశైలం నియోజకవర్గంలో యువగళం పాదయాత్రను విజయవంతం చేద్దాం అని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం నాడు బండి ఆత్మకూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రపై టిడిపి మహానంది, బండి ఆత్మకూరు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జులు, బూత్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు వెలుగోడు, బండి ఆత్మకూరు మండలంలో పాదయాత్ర నడుస్తుందని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త పొన్నూరు రామలింగారెడ్డి, మాజీ మహానంది ట్రస్ట్ బోర్డ్, చైర్మన్, పాణ్యం ప్రసాద్, బణత్వార్ మండల టిడిపి ఇన్చార్జ నందిపాడు నరసింహారెడ్డి, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు బొల్లారం మల్లేశ్వర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి కంచర్ల చిన్న లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబును దళితులు నమ్మరు : వైసిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి అధినేత చంద్రబాబును దళితులు నమ్మే స్థితిలో లేరని వైసిపి నాయకులు పెరుమళ్ళ జాన్ మంగళవారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు దళితుల కోసం ప్రత్యేకంగా చంద్రబాబు చేసిందన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో సీఎం జగన్ దళిత ద్రోహి అంటూ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. నిజమైన దళిత ద్రోహులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు అని అన్నారు. ఇకనైనా చంద్రబాబు దళితులను కించపరిచేలా, అవమానించేలా వ్యాఖ్యానించడం మానుకున్నప్పుడే భవిష్యత్తు ఉంటుందని హితవు పలికారు.

హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్రంలోని ఉభయ దేవాలయాల్లో హుండీలలో భక్తులు చెల్లించుకున్న కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.33,78,554 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రధాన ఆలయాల్లో భక్తులు 41 రోజులపాటు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ ప్రాంగణంలోని అభిషేక మండపంలో సిబ్బందితో లెక్కించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల మధు, ధర్మకర్తల మండలి సభ్యులు జి.మల్లికార్జున రావు, ఆలయ పర్యవేక్షకులు ఓ.వేంకటేశ్వరుడు, ఏ.శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్స్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గుర్రం మృతి

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని పెద్ద కంబలూరు గ్రామంలో మంగళవారం పిడుగుపాటుకు గుర్రం మృతి చెందింది. గ్రామస్తుల వివరాల మేరకు.. బాల వెంకట కుమారుడు భూపాల్‌కు చెందిన గుర్రం ఇంటి దగ్గర మేత మేస్తుండగా ఒక్కసారిగా ఉరుములతో గాలివాన వీచి గుర్రం సమీపంలో పిడుగు పడింది. దీంతో గుర్రం అక్కడికక్కడే మృతి చెందింది. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పశువుల కాపరులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో గాలి వాన వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, సెల్ టవర్లు, మైదాన ప్రాంతంలో ఉండరాదని, సురక్షిత ప్రాంతాలైన ఇళ్లలో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలో శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరుకళ్యాణ ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి వార్లను రథోత్సవంపై కూర్చోబెట్టి గ్రామ పురవీధులలో మేళ తాళాలతో, భాజాభజంత్రీలతో, కోలాటాలతో అశేష భక్తజనం నడుమ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ వంశస్థులు, రైతు సంఘం పెద్దలు, ఆలయ అర్చకులు, రథోత్సవం వెంట కదులుతూ పూజలను నిర్వహించారు. గ్రామస్తులు రథోత్సవానికి పూజలను నిర్వహించి కానుకలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ఉప సర్పంచి చల్లా రఘునాథరెడ్డి, సహకార పరపతి సంఘం చైర్మన్ చల్లా భాస్కర్ రెడ్డి, వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, రాజ వంశస్థులు త్రివిక్రమ వర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో 11, 9 సంవత్సరాలలోపు బాలికల, ఓపెన్ చెస్ పోటీలు మంగళ వారం స్థానిక శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన 9 సంవత్సరాలలోపు వారికి కృష్ణా జిల్లాలో, 11 సంవత్సరాలలోపు వారికి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో నంద్యాల జిల్లా తరపున పాల్గొంటారని జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఈ పోటీలను జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, ఆర్బిటర్ సుజాత, శ్రీనాథ్ రెడ్డి, రవి నాయక్ పర్యవేక్షించారు.

జ్ఞానాన్ని పెంపొందించేవి గ్రంథాలయాలు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్ : జ్ఞానాన్ని పెంపొందించేవి గ్రంథాలయాలు అని బనగానపల్లె గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం బనగానపల్లె శాఖ గ్రంథాలయంలో రెండవ రోజు వేసవి విజ్ఞాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఎం.శ్రీరాములు విచ్చేసి మాట్లాడారు. నేటి విద్యార్థినీ విద్యార్థులు పెద్దల పట్ల, గురువుల పట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవాభిమానాలు కలిగి ఉండాలన్నారు.అప్పుడే పెరిగి పెద్దవారై సమాజంలో మంచి స్థాయికి చేరుకుంటారని చెప్పారు. విద్యార్థులు ఈ వేసవి సెలవులను గ్రంథాలయాల్లో గడిపి, సమయాన్ని వృధా చేయకుండా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున దాతలు ముందుకు వచ్చి మజ్జిగ ప్యాకెట్లను ఇవ్వాలని, పిల్లలకు వేసవి వడదెబ్బ కలగకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరుడి విగ్రహ పునఃప్రతిష్ట

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గంగుల దంపతులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణ శివార్లలో ఉన్న కాచింతల శైవ క్షేత్రంలో మంగళవారం నందీశ్వరుడి విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, గంగుల ఇందిరమ్మ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, వైసిపి నాయకులు కందుకూరు గోపాల్ రెడ్డి,

జర్నలిస్ట్‌ను అవమానించిన తహశీల్దార్

- కంపెనీ ఐడి కార్డు కాదు.. అక్రిడిటేషన్ ఉంటేనే లోపలికి.. లేదంటే బయటికి పో అంటూ హుకుం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

'కంపెనీ ఇచ్చిన ఐడి కార్డు కాదు.. అక్రిడిటేషన్ ఉంటేనే లోపలికి రా...' అంటూ నవనంది ఛానల్ ఎడిటర్ నందవరం శ్రీనివాసులును నంద్యాల తహశీల్దార్ అవమానించిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. నంద్యాల పట్టణంలోని లాయరు పుల్లయ్య, బిళ్ళల్లాపురం దేవాంతకుడు కలిసి తహశీల్దారుకు వినతి పత్రం ఇచ్చేందుకు మంగళవారం వచ్చారు. వారు నంద్యాల నవనంది చానల్ ఎడిటర్ నందవరం శ్రీనివాసులును వీడియో కవర్ చెయ్యమని పిలిచారు.ఆయన వారి వెంటవెళ్లి వినతి ఇస్తుండగా ఫొటోలు తీస్తుండగా తహశీల్దార్ 'ఎవరు మీరు.. ఎందుకు ఫొటో తీస్తున్నావ్..' అని అడిగారు. సమాధానంగా నందవరం శ్రీనివాసులు 'నేను నవనంది చానల్ ఇంచార్జి అని, ఐడి కార్డు చూపించాడు' వెంటనే తహశీల్దార్ అక్రిడిటేషన్ ఉంటేనే ఆఫీస్‌లోపలికి రావాలని, లేదంటే రాకూడదని, బయటకు వెళు అంటూ హుకుం జారీ చేశారు. అనంతరం జర్నలిస్టు మాట్లాడుతూ ఒక సీనియర్ జర్నలిస్ట్ అయిన తనను అవమానించి మాట్లాడిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తానన్నారు. జర్నలిస్టులందరూ ఏకం కావాలని, లేకపోతే ఇలాంటి అవమానాలు ప్రభుత్వం కార్యాలయాలలో ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇప్పుడు ఉన్న జర్నలిస్టులలో వందలో పది మందికి మాత్రమే అక్రిడిటేషన్‌లు ఉంటాయని చెప్పారు. అక్రిడిటేషన్లు లేని వాళ్ల జర్నలిస్ట్‌లు కారని తహసీల్దార్ ఎలా చెప్తారని, అక్రిడిటేషన్ ఉన్నా లేకున్నా సంస్థలు జారీ చేసిన ఐడి కార్డులు ఉంటే చాలని హైకోర్టు చెప్పిందని గుర్తు చేశారు.



నంద్యాల తహశీల్దార్ కార్యాలయం

తహశీల్దార్‌తో మాట్లాడుతా : డిఆర్ఒ

ఈ విషయం తహశీల్దార్‌తో మాట్లాడి ఏం జరిగిందో తెలుసుకుంటానని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూస్తానని డిఆర్ఒ తెలిపారు. అనంతరం ఫిర్యాదు చేసిన జర్నలిస్ట్ నందవరం శ్రీనివాసులుకు సర్ది చెప్పి పంపించారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మోసపూరిత ఆన్లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టి సైబర్ నేరాల గాళ్ళ వలలో పడి మోసపోవద్దని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ప్రజలను హెచ్చరించారు. మంగళవారం సైబర్ నేరాలపై జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నారని ఆశపడి ఆకర్షితులైతే సైబర్ నేరగాళ్ల చేతిలో నిలువుదోపిడికి గురయ్యే అవకాశం ఉందని సూచించారు. మోసపూరిత ఆన్లైన్ ట్రేడింగ్లో డబ్బులు పెట్టి మోసపోవద్దని, డబ్బులు పోయాక బాధపడడం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్త పడాలని తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే నంద్యాల సైబర్ ల్యాబ్‌కు లేదా 1930కి కాల్ చేస్తే మోసపూరిత డబ్బు సైబర్ నేరగాళ్ల చేతికి పోకుండా ఫ్రీజ్ చేయవచ్చని, లేదా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ (www.cybercrime.gov.in) లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారన్నారు. మీ బ్యాంక్ అక్కౌంట్ నెంబర్‌ను, ఒటిపి (ఒన్ టైమ్ పాస్వర్డ్)ను, మీ బ్యాంక్ పిన్ నెంబర్‌ను, సిసివి నెంబర్‌ను ఈ సున్నితమైన వివరాలను ఎవరితోనైనా పంచుకోవడం వలన మీ ఖాతా ఖాళీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కావున నంద్యాల జిల్లా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని కాల్ మెసేజ్ చేస్తూ ఉంటారని, ఆన్లైన్ లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త పడాలన్నారు. బ్యాంక్ వినియోగదారుల సెల్ నెంబర్‌కి వచ్చే ఒటిపి ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడుతూ, తెలియని వారితో పంచుకోవద్దని, బ్యాంక్ వినియోగ దారులకు బ్యాంక్ అధికారులు ఎలాంటి సందర్భాల్లో మొబైల్ ద్వారా సంప్రదించి వివరాలు అడగరని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి లావాదేవీ వివిధ ఆన్లైన్ యాప్‌ల ద్వారా జరుగుతున్నాయని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండి సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సున్నితమైన విషయాలను, సామజిక మాధ్యమాలలో వచ్చే లింక్స్‌ని క్లిక్ చేసి మోసపోవద్దన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

'ఉపాధి'ని కాపాడుకుందాం : వ్యకాస

ప్రజాశక్తి - కొత్తపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులను తగ్గించి నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని, అందరం కలిసి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, మండల కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని సింగరాజు పల్లి, పెద్ద గుమ్మడాపురం, ముసలిమడుగు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను వారు పరిశీలించి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ఈనెల 15న నంద్యాల కలెక్టరేట్ ముందు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరుగు ధర్నాలో ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో రూ.30 వేల కోట్లను కోత పెట్టిందన్నారు. ఉపాధి కూలీలను పనులకు దూరం చేసేందుకు ఉపాధి పథకంలో రెండు పూటల ఆన్లైన్ ఫోటో యాప్ ద్వారా మస్టర్ వేసే విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. మేటీలకు పారితోషికాలు, ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సులు, వాటర్ అలవెన్సులు, పనిముట్లకి ఇచ్చే అలవెన్సులు, రవాణా చార్జీలకు కోత విధించిందని చెప్పారు. నెలల తరబడి ఉపాధి బిల్లులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. రోజు వేతనం 600 రూపాయలు ఇచ్చి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, ప్రమాద బీమా కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జగదీష్, పుల్లయ్య, నరేంద్ర, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా నాయకులు బొల్లు ప్రసాద్, బాబు యాదవ్, ఉపాధి కూలీలు జంగా నాగరత్నం, జంగా శ్రీను, పైడిమాను రవికుమార్, నక్క విజయుడు, పద్మమ్మ, పార్వతమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్సు పాసులు ఇవ్వాలి : ఎఐఎస్‌ఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : ఇంటర్న షిప్ ప్రాజెక్టు పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బస్సు పాసులు ఇవ్వాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. మంగళవారం విద్యార్థులతో కలిసి ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్, సిఐ, సిఎం నాయుడుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు గత సంవత్సరం నుండి ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నారని, ప్రాజెక్టును పూర్తి చేయడానికి విద్యార్థులు వేరే ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియ జేశారు. విద్యార్థులకు పాస్ ఇవ్వడానికి ఎటువంటి అభ్యంతరం లేదని డిపో మేనేజర్ అన్నారు. అయితే డిపో మేనేజర్ బస్సు పాస్ ఇంచార్జి సిఎం నాయుడును కలవమని చెప్పడంతో సిఎం నాయుడును కలిశారు. ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ రాసే విద్యార్థులకు బస్సు పాస్ ఇవ్వడం కుదరదని కరాకండిగా చెప్పారు. విద్యార్థులు డిగ్రీ కాలేజీ నుండి పాణ్యం అయ్యలూరుమెట్ట ప్రాంతాల మీదగా ఇంటర్న షిప్ ప్రాజెక్టు పూర్తి చేయుటకు వెళ్లాల్సి ఉంటుంది కాబట్టి బస్సు పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి డిపో మేనేజర్ కార్యా లయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుంజయుడు మాట్లాడుతూ రేకుల షెడ్డులలో తరగతులు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూల్ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల మామూళ్ళ మత్తులో పడి విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా, అర్హత కలిగిన అధ్యాపకులు లేకుండా,శానిటేషన్ సర్టిఫికెట్ లేకుండా,ఆటస్థలం పార్కింగ్ స్థలం లేకుండా రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామి, నాయకులు మనోహర్, చంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం : చైర్మన్

ప్రజాశక్తి - ఆత్మకూర్

గ్రామీణ, పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను వారు తనిఖీ చేశారు. ముందుగా ప్రతి నెల 9వ తేదీన నిర్వహిస్తున్న బాలింతలు, గర్భవతుల స్కానింగ్ కేంద్రాన్ని సందర్శించి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో టెక్నాలజీ పరికరాల కొరతను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి చొరవతో ఎన్నో సంవత్సరాల నుంచి అందుబాటులో లేని ఎక్సరే ప్లాంటును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డాక్టర్ నియమించే విధంగా రంగం సిద్ధం చేశారన్నారు. ఆత్మకూరు కమిషనర్ పెనుకొండ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రాజగోపాల్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, ఖైరూన్ బి, రంగస్వామి, షఫివుల్లా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిశువులను పరిశీలిస్తున్న చైర్మన్

12 నుండి 'పల్లెపల్లెకు సిపిఐ' : రంగనాయుడు

- 18న డోన్‌లో జరిగే బహిరంగ సభకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

ప్రజాశక్తి - ప్యాపిలి : హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీళ్లు నింపాలని ఈ నెల 12 నుంచి డోన్ నియోజకవర్గంలో పల్లె పల్లెకు సిపిఐ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. మంళవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. డోన్ ప్రాంతంలో నిత్యం కరువు విలయ తాండవం చేస్తుందన్నారు. రైతులకు పంట పెట్టుబడి కూడా రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు, వలసలు వెళు తున్నారని, ఈ ప్రాంతం నుండి ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నా కరువు నివారణకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమయ్యారన్నారు. అందుకే హంద్రీనీవా కాల్వ ద్వారా డోన్ నియోజకవర్గంలో చెరువులు నింపాలని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. 2007 సంవత్సరం నుండి డోన్ పట్టణంలో పేద ప్రజలకు రుద్రాక్ష గుట్టలో ఇంటి స్థలాల కోసం ఉద్యమం కొనసాగుతూ దాదాపు 800 మందికి పైగా నివాసాలు ఏర్పాటు చేసుకొని వాటికి పట్టాల కోసం పోరాటం చేస్తున్నా మన్నారు. ప్యాపిలి, బేతంచెర్ల మండలంలో సబ్ ట్రెజరర్, ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో సిపిఐ ఆధ్వర్యంలో పర్యటించి సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేసి ఈ నెల 18న నియోజకవర్గం సమగ్ర అభివృద్ధిపై డోన్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ సేవా వాహిని వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో మంగళవారం నృసింహ సేవా వాహిని 6వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణ చైతన్య స్వామి సూచన మేరకు అహోబిలం ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్య స్వామి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఇంచార్జి రవికాంత్ చౌదరి, ఉప్పల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రవికాంత్ చౌదరి మాట్లాడుతూ శ్రీ నృసింహ సేవా వాహిని సంస్థను స్థాపించిన నేటికీ 5 వసంతాలు పూర్తి చేసుకుని 6వ వసంతంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించామని, సంస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వర్తిస్తూ కరోనా కష్టకాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలో కొన్ని లక్షల మందికి అన్న ప్రసాదాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వరదల సమయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిత్యావసర సరుకులు, అన్న ప్రసాదం, దుస్తులు అందజేసినట్లు చెప్పారు. మున్ముందు ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నృసింహ సేవా వాహిని బృందం, భక్తులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వినతుల పరిష్కారం కోసమే జగనన్నకు చెబుదాం : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

స్పందన వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.ఈ క్రమంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఎంపిడివో వాసుదేవ గుప్త, డిప్యూటీ తహశీల్దార్ హరిత, యస్ఐ బాబు, ఏపివో వసుధ, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా విజ్ఞప్తుల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించే ఉద్దేశంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బేతంచర్ల : పేద బడుగు బలహీన వర్గాల పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఎటువంటి విభేదాలు లేకుండా వర్తింపజేయడమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని గుంటుపల్లె సర్పంచ్ శ్రీరాములు అన్నారు. బేతంచెర్ల మండలం గుంటుపల్లి గ్రామంలోని సచివాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ రంగస్వామి ఆధ్వర్యంలో టివిలో ప్రోగ్రాం ద్వారా ప్రజలు వీక్షించే విధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రంగస్వామి, గుంటుపల్లి సర్పంచ్ శ్రీరాములు మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ పారదర్శక పాలన అందించడమే వైయస్సార్సీ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో గుంటుపల్లి ప్రజలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీపీ సంజీవరెడ్డి, అధికారులు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడిఏ రాజశేఖర్

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - బనగానపల్లె

విత్తనాలను ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో విత్తన అమ్మకం ధరలు రసాయనిక ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. మండలంలోని నందివర్గం వ్యవసాయ కష్టమ్ హైర్ సెంటర్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఏడిఏ రాజశేఖర్ మాట్లాడుతూ విత్తనాలు, రసాయనిక, ఎరువులు నిర్దేశించిన ధరలకు అమ్మాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు నకిలీ రసాయనకి ఎరువులు, పురుగుల మందులు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పైర్లకు సంబంధించి పంట దిగుబడిని కాపాడుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన, రసాయనక డీలర్లు, ఆర్బికే సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రధమ వార్షికోత్సవం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం సమీపంలోని అప్పనపల్లి ప్రధాన రహదారిలో వెలసిన శ్రీ వాసాపుర వెంకటేశ్వర ఆలయ ప్రధమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మొదటి రోజు ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహా త్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాటం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అల్పాహారం, భోజన వసతులు కల్పించారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయండి

- మిలర్లకు జెసి ఆదేశాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అకాల వర్షాలు కురవటం వలన రైతులు నష్టపోకుండా మద్దత్తు ధర కల్పించి రైస్ మిల్లర్లు ట్రేడర్లు వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి మిలర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం యస్.ఆర్.ఆర్ సెంటినరీ హాల్‌లో రైస్ మిలర్లతో జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఇటీవల నంద్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు బండి ఆత్మకూరు, వెలుగోడు, తదితర మండలలో కొంతమేర వరి ధాన్యం తడిచి నందున రైతులు నష్టపోకుండా వరి ధాన్యము మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైస్ మిల్లర్లు ట్రేడర్లకు తెలిపారు. అవసరమైతే తడిసిన ధాన్యాన్ని డ్రయ్యర్స్ సహాయంతో బాగుపరచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి బాధిత రైతులకు సహకరించాలన్నారు. నంద్యాల జిల్లాలోని రైస్ మిల్లర్స్ అందరూ మొదటగా నంద్యాల జిల్లా రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. రైస్ మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని రీసైకిల్ చేసినట్లైతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని జేసి హెచ్చరించారు. రైస్ మిల్లర్లు అందరూ సీల్డ్ రైస్ వేలములో పాల్గొనాలన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

ప్రజాశక్తి - నంద్యాల

స్థానిక శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో భారతీయ నోబెల్ బహుమతి గ్రహీత, జాతీయ గీత నిర్మాత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యాసంస్థల అధినేత జి.రామకృష్ణ రెడ్డి మాట్లాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ భారత జాతి నిర్మాత, గీతాంజలి కావ్య రచనతో జాతికి జన గణ మన జాతీయ గీతాన్ని అందించిన విశ్వకవి అన్నారు. ఆయనకి నోబెల్ బహుమతి లభించడం భారత జాతి గర్వింపదగిన అంశమన్నారు. రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల సంచాలకులు డాక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ఠాగూర్ సాహితీవేత్త అని, సంగీత చిత్ర కళలలో చక్కని ప్రావీణ్యం కలవారన్నారు. విద్యార్థులు కూడా కేవలం పుస్తకాల చదువుకే పరిమితం కాకుండా ఇతర చిత్ర కళలు, స్పోర్ట్స్, గేమ్స్ మొదలైన వాటిపై దృష్టి పెట్టి రవీంద్రనాథ్ ఠాగూర్ ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని చెప్పారు. అనంతరం జాతీయ గేయ ఆలాపనతో ఈ కార్యక్రమం ముగిసింది.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గడివేముల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మద్దిలేటి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గని గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సచివాలయం ఆవరణంలో గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో మంచానికే పరిమితమైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని, ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాతకోట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పింఛన్లు, వైయస్సార్ ఆసరా, విద్య దీవెన, విద్యా కానుక, వసతి దీవెన ఇలా ఎన్నో పథకాలను సిఎం ప్రవేశపెట్టారన్నారు. వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటరమణ, వైసిపి నాయకులు ఎర్రం వెంకటరెడ్డి, జయరాం రెడ్డి, రాజు, మసీదుల సుభాన్,మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్థర్